క్లుప్తంగా

ఎక్సైజ్ సీఐగా భాస్కర్‌రావు



తొర్రూరు: తొర్రూరు ఎక్సైజ్ సీఐగా దేవరనేని భాస్కర్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్ డైరెక్టర్ ముషారఫ్ అలీ ఫరూఖీ ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల పట్టణంలో ఎక్సైజ్ ఎస్సైగా పని చేసిన ఆయన పదోన్నతిపై తొర్రూరుకు వచ్చారు. ఇప్పటి వరకు సీఐగా పని చేసిన బూస అశోక్ ఆదిలాబాద్‌కు బదిలీ అయ్యారు.

సస్పెన్షన్ ఎత్తివేత

గూడూరు: మండలంలోని గాజులగట్టు సర్పంచ్ పడిగె వసంత, ఉప సర్పంచ్ ఎలికట్టె వెంకన్నగౌడ్‌లపై సస్పెన్షన్ ఎత్తివేస్తూ శుక్రవారం కలెక్టర్ శశాంక ఉత్తర్వులు జారీ చేశారు. గత డిసెంబర్ నెలలో కొంతమంది అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు జిల్లా అధికారులు రికార్డులు సరిగా లేవనే ఉద్దేశంతో సర్పంచ్, ఉప సర్పంచ్‌లను సస్పెన్షన్ చేసిన విషయం తెలిసిందే.

పనిచేస్తేనే గుర్తింపు



కేసముద్రం: ప్రతీ ఒక్కరు వృత్తిలో అంకిత భావంతో పనిచేస్తేనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. కేసముద్రం పీహెచ్‌సీలో పీహెచ్‌ఎన్‌గా పనిచేసిన సక్కుబాయి, ముల్కనూర్ పీహెచ్‌సీకి సీహెచ్‌ఓగా పదోన్నతిపై వెళ్తుండగా, శుక్రవారం మండల కేంద్రంలో ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరు వృత్తిపట్ల క్రమశిక్షణతో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అంబరీష్, వైస్ ఎంపీపీ రావుల నవీన్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సట్ల వెంకన్న, వైద్యులు శ్రావణ్, నంబికిషోర్, సురేష్, విజయ్‌కుమార్, శివరాం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



నెహ్రూసెంటర్/పెద్దవంగర/మరిపెడ/నెల్లికుదురు: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు కొండ్ర ఎల్లయ్య పార్టీ జెండాను శుక్రవారం ఆవిష్కరించారు

కుట్టు శిక్షణతో మహిళలకు ఉపాధి



తొర్రూరు రూరల్: ఐకేపీ, స్త్రీనిధి ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణతో మహిళలు, యువతులకు ఉపాధి పొందే అవకాశం ఉందని ఎంపీపీ తూర్పాటి అంజయ్య, జడ్పీ ఫ్లోర్ లీడర్ మంగళపెల్లి శ్రీనివాస్, ఈజీఎస్ స్టేట్ డైరెక్టర్ లింగాల వెంకటనారాయణగౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని నాంచారీ మడూరు గ్రామంలో కొనసాగుతున్న కుట్టు మిషన్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో సంబంధిత మహిళలకు కుట్టు మిషన్లు, మెరిట్ సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్యాంసుందర్‌రెడ్డి, సర్పంచ్‌లు గుంటుక యాదలక్ష్మి, పోసాని పుష్పలీలా, జాటోతు శారద, శోభన, ఏపీఎం ఉపేందర్, సీసీలు, సీఏలు, శిక్షణ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఓటు అడిగే హక్కు నాకే ఉంది

- ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

కురవి: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తూ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిలోకి తీసుకెళ్తున్నామని, ఓటు అడిగే హక్కు తనకే ఉందని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. శుక్రవారం సీరోలు మండలం బీల్యానాయక్ తండా, కాంపల్లి, బూరుగుచెట్టు తండా గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో ఆయన మాట్లాడుతూ.. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధి చేస్తున్నానని తెలిపారు. బీల్యానాయక్ తండాలో డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సురేష్, శోభారాణిరమేష్, పరశురాం, ఎంపీటీసీ భోజ్యానాయక్, ఎంపీపీ పద్మావతిరవినాయక్, సొసైటీ చైర్‌పర్సన్ శ్రీదేవి, ఆర్‌బీఎస్ మండల కోఆర్డినేటర్ రమేష్, ఆత్మ చైర్మన్ తోటలాలయ్య, బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి పిచ్చిరెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీఓ సరస్వతీ నాయకులు పాల్గొన్నారు.



కురవి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

కేసీఆర్‌తోనే సమగ్ర అభివృద్ధి

చిన్నగూడూరు: సీఎం కేసీఆర్‌తోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. మన్నెగూడెం వద్ద గల ఆకేరు బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.15కోట్లు మంజూరైన సందర్భంగా మన్నెగూడెం గ్రామస్తులు శుక్రవారం మండలంలోని ఉగ్గంపల్లిలో ఎమ్మెల్యేను కలిశారు. బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేసిన ఎమ్మెల్యేను గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ బంటు ఉపేందర్, సర్పంచ్ వెంకటరమణ, ఎల్లయ్య, నాయకులు ఉన్నారు.



మిరప నారుపై కప్పిన చీరలు

చీర నీడన మిరపనారు

దోర్నకల్ మండలంలోని పలు గ్రామాల్లో రైతులు వ్యవసాయ భూముల్లో మిరప విత్తనాలు విత్తారు. విత్తనాలు మొలకెత్తడంతో ఎండ నుంచి కాపాడేందుకు నారుమళ్లపై చీరలను కప్పారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున మిరప పంట సాగు కోసం రైతులు మిరప నారును సిద్ధం చేసుకుంటున్నారు. - దోర్నకల్

తెలంగాణ అభివృద్ధే ప్రధాని లక్ష్యం

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పీఎం మోదీ అనేక నిధులు కేటాయిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నాడని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. వరంగల్ జిల్లాకు మౌలిక సదుపాయాల అభివృద్ధికి పీఎ మోదీ రూ. 6,100 కోట్లతో శంకుస్థాపన చేయనున్నారన్నారు. నేడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్‌లో జరిగే విజయ సంకల్ప సభను విజయవంతం చేయాలన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు రామచందర్ రావు, గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేయిన్ నాయక్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యాప సీతయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లి మల్లయ్య, సీనియర్ నాయకులు మాధవపెద్ది శశివర్ధన్ రెడ్డి, మోసంగి మురళి, ఎర్రంరెడ్డి సిద్ధార్థ రెడ్డి, పసుపులేటి నవీన్ నాయుడు, గుగులోతు రాంబాబు నాయక్, సందీప్, శ్రీను పాల్గొన్నారు.



మహబూబాబాద్ అర్బన్: మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి

గిరిజన అభివృద్ధిపై నిలదీయాలి

డోర్నకల్: జిల్లాలో అధికార పార్టీకి చెందిన గిరిజన ప్రజాప్రతినిధులు కేసీఆర్ భజన ఆపి గిరిజన అభివృద్ధిపై నిలదీయాలని మాజీ ఎంపీ, బీజేపీ సీనియర్ నాయకులు రవీంద్రనాయక్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. పచ్చబొట్టు వేయించుకుని చెప్పులు లేకుండా తిరుగుతూ మంత్రి, ఎన్నికల్లో సీటు కోసం ఎమ్మెల్యేలు, ఎంపీలు కేసీఆర్ భజన చేస్తూ గిరిజనాభివృద్ధిని విస్మరించారని తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో జరిగే విజయ సంకల్పసభకు డోర్నకల్ నియోజకవర్గం నుంచి వేలాదిగా ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీధర్‌రెడ్డి, నియోజకవర్గ ప్రభారి ఈవీ రమేష్, ఇన్‌చార్జ్ గుగులోత్ లక్ష్మణ్‌నాయక్, కన్వీనర్ పూర్ణచందర్‌రావు పాల్గొన్నారు.

తెలంగాణ అభివృద్ధికి మోదీ సహకారం

తొర్రూరు: తెలంగాణ అభివృద్ధికి ప్రధాని మోదీ సహకారం అందిస్తున్నారని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాషా అన్నారు. ప్రధాని వరంగల్ సభకు జనసమీకరణపై శుక్రవారం డివిజన్ కేంద్రంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సభకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్, నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, ఎస్సీ మోర్చా నాయకులు అలిసేరి రవిబాబు, రూరల్ అధ్యక్షుడు బొచ్చు సురేష్, నాయకులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

మహబూబాబాద్ రూరల్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని మహబూబాద్ టౌన్ సీఐ వై.సతీష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాలలో హ్యాండిల్ తాళాలు వేయని ద్విచక్ర వాహనాలను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శుక్రవారం సాయంత్రం సదరు వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎస్సైలు రవి, దీపికరెడ్డి, విజయరాంకుమార్, రామారావు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

చిన్నగూడూరు: వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ వల్లూరి పద్మ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై ఏఎన్‌ఎమ్స్, ఆశాలు, హెల్త్ అసిస్టెంట్లు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ విజయ్ కుమార్, ఎంపీడీఓ శ్యాంసుందర్, మండల బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

పెద్దవంగర: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం యూనిట్లు మంజూరు చేసి ప్రోత్సహిస్తుందని నాబార్డు సెంట్రల్ అధికారి శశ్వాతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు వడ్డెకొత్తపల్లి, చిట్యాల గ్రామాల్లో చిరు ధాన్యాలతో పలు రకాల ఆహార ఉత్పత్తులపై తయారు చేయు విధానంపై శిక్షణ తరగతులను శశ్వాతి, నాబార్డు స్టేట్ ఏజీఎం చంద్రశేఖర్ కలిసి వారు పరిశీలించారు. చిరుధాన్యాలను రోజు తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

మహబూబాబాద్ అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయ కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరింపజేయాలని తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి శ్రీకాంత్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం మానుకోట మండల అధ్యక్షుడు వీరన్న అధ్యక్షతన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈనెల 20న పట్టణంలో జరిగే పాత పెన్షన్ సాధన సంకల్పయాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీలు రవిచంద్ర, అశోక్, నాగరాజు, జిల్లా బాధ్యులు నాగముని ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ అర్బన్: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

దంతాలపల్లి: తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ ఎంప్లాయిస్ యూనియన్ మండల శాఖ అధ్యక్షుడు బాద యాకసాయిలు ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. తహసీల్దారు శివాని, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, మహేందర్‌రెడ్డి, యాకసాయిలు పాల్గొన్నారు.

జీతాలు ఇవ్వడం మరిచిన ప్రభుత్వం

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ ప్రభుత్వం ఈనెల రావాల్సిన జీతాలు ఇంకా విడుదల చేయలేదని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వాలని విషయం ప్రభుత్వం పూర్తిగా మరిచిపోయిందన్నారు. ఎంతో మంది ఉద్యోగ, ఉపాధ్యాయుల బ్యాంక్ రుణాలు నెలల వారిగా వాయిదాలు గడవు తేదీలోగా చెల్లించకపోవడంతో బ్యాంక్‌లకు డిపాల్టర్లుగా మారుతున్నారన్నారు. సకాలంలో ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీతాలు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బాలాస్టి రమేష్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాచకొండ ఉపేందర్, విద్యాసాగర్, గోవర్ధన్, సర్దార్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పోడు పట్టాలు ఇవ్వాలి

గార్ల: అర్హులైన పోడు రైతులందరికీ పోడు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అఖిలపక్షం నాయకుల ఆధ్వర్యంలో పోడు రైతులతో కలిసి 2గంటల పాటు ధర్నా నిర్వహించారు. 25శాతం మంది పోడు రైతులకు పట్టాలు ఇచ్చి మిగతా రైతులకు ప్రభుత్వం మొండిచేయి చూపిస్తుందని విమర్శించారు. అనంతరం తహసీల్దార్ వీరన్నకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం ,సీపీఐ, న్యూడెమోక్రసీ నాయకులు కందునూరి శ్రీనివాసరావు, వెంకన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

కేసముద్రం: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ మురళీనాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని కేసముద్రం విలేజ్‌లో గల అమీరొద్దీన్ బాబా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కోరుకొండపల్లి గ్రామంలో పల్లె పల్లెకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఎండి.అయూబ్‌ఖాన్, గోపాల్‌రెడ్డి, సంకెపల్లి నారాయణరెడ్డి, మాసాడి శ్రీనివాస్, వేముల శ్రీనివాస్‌రెడ్డి, సట్ల శ్రీను పాల్గొన్నారు.



కేసముద్రం: దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మురళీనాయక్

గెలుపే లక్ష్యంగా పని చేస్తాం..

డోర్నకల్: డోర్నకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దరంసోత్ జగదీష్ తెలిపారు. స్థానిక పంపుబావితండాలో శుక్రవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో మాట్లాడుతూ.. అందరినీ కలుపుకుని పని చేస్తూ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలోనాయకులు భూక్యా తారాచంద్, ఎల్లావుల హరికృష్ణ, అనంతుల ఉపేందర్‌గౌడ్, ఖాదర్‌బాబా, వీరస్వామి, ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం



మహబూబాబాద్ రూరల్: మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

మహబూబాబాద్ రూరల్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అనర్హతపై స్టే కోసం వేసిన పిటిషన్‌ను గుజరాత్ హైకోర్టు విచారణకు స్వీకరించకుండా తిరస్కరించిందని అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య అన్నారు. అర్బన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు తోట వెంకన్న, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రియాజ్ అన్సారీ, లక్ష్మీనారాయణ, నర్సింగ శ్రీనివాస్, గిరి, అమీర్ పాల్గొన్నారు.

కేసముద్రం: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్, సారయ్య, గోపాల వెంకట్‌రెడ్డి, బాదావత్ శంకర్, బానోతు వెంకన్న, చిదురాల వసంతరావు, ఎంపీటీసీ బాలునాయక్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎస్సైగా బాధ్యతల స్వీకరణ

బయ్యారం/కురవి: బయ్యారం ఎస్సైగా ఉపేందర్, కురవి ఎస్సైగా బి.గోపి శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

గార్ల: జిల్లా కేంద్రమైన మహబూబాబాద్ నుంచి గార్లకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ తెలంగాణ విద్యా వంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు జంపాల విశ్వ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

సన్మానం

గార్ల: గార్ల సీహెచ్‌సీ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్ ఇటీవల వైద్య రత్న అవార్డు అందుకున్నాడు. ఈమేరకు శుక్రవారం ఆయనను సీహెచ్‌సీలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో టీటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శివ, జిల్లా అధ్యక్షుడు వీరునాయక్, నాయకులు రామచంద్రు, శ్రీను ఉన్నారు.

బీజేపీని ఓడించాలి

మరిపెడ: మతోన్మాద బీజేపీని ఓడించాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు వీరవెల్లి రవి పిలుపునిచ్చారు. మరిపెడలో శుక్రవారం సంఘం ప్రథమ మహాసభ గోగుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రవి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమలో నాయకులు మధు, సాయి, ప్రేమ్, ఉమ, శేఖర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై చర్య తీసుకోవాలి

నర్సింహులపేట: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్న మధుతండా ఉపాధ్యాయుడు శ్రీకాంత్‌పై చర్య తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పట్ల మధు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని హైస్కూల్‌లో విధులకు రాకుండా నిర్లక్ష్యంగా ఉన్న టీచర్ శ్రీకాంత్‌పై చర్యలు తీసుకోవాలని నోడల్ హెచ్‌ఎం శ్రీలతకు వినతిపత్రం అందచేశారు.

అరెస్టులను ఖండించండి

నెహ్రూసెంటర్: మోదీ వరంగల్ పర్యటన సందర్భంగా హామీలను అమలు చేయాలని నిరసన చేస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కెళ్లల్లి శ్రీనివాసరావు, నేతలను అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి శుక్రవారం అన్నారు.

విజయవంతం చేయాలి

పెద్దవంగర: హనుమకొండలో నేడు చేపట్టిన ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్ శుక్రవారం కోరారు. కార్యక్రమంలో నాయకులు రవి, శంకర్, ఆనంద్ పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగుల అందజేత

పెద్దవంగర: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో చదువుతున్న 32 మంది విద్యార్థులకు యూత్ ఫర్ సేవా సమితి వరంగల్‌కు చెందిన సంస్థ ప్రతినిధులు బండారి రమేష్, మల్లికార్జున్ శుక్రవారం రూ.35వేల విలువ చేసే స్కూల్ బ్యాగులతో పాటు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. స్కాలర్‌షిప్‌లు సాధించి విద్యార్థులను సన్మానించారు. విజయ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్ పరిశీలన

డోర్నకల్: డోర్నకల్ మార్కెట్‌లో ఇటీవల కూరగాయలు చోరీకి గురికావడం స్థానికంగా కలకలం రేపింది. ఈనేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ రాంచంద్రునాయక్ ఆధ్వర్యంలో మార్కెట్‌ను పరిశీలించి మాట్లాడారు. మార్కెట్‌కు రక్షణ లేక చోరీలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్, సుమేర్‌చంద్ జైన్, పగడాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి

గార్ల: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా నాయకులు మహేష్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాయి, పృథ్వీరాజ్, విశాల్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

గూడూరు: మండల కేంద్రంలో ఏర్పాటైన సీహెచ్‌సీకి వైద్యుల అవసరాన్ని గుర్తించిన జిల్లా అధికారులు ఐదుగురు వైద్యులను పంపించారని సూపరింటెండెంట్ డాక్టర్ వీరన్న శుక్రవారం తెలిపారు. సీహెచ్‌సీలో వైద్యం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్రీడా పాఠశాలకు ఎంపిక

దంతాలపల్లి: నేటినుంచి మండల స్థాయి క్రీడా పాఠశాలలో సీట్ల భర్తీ కోసం విద్యార్థులను ఎంపిక చేయనునట్లు ఎంఈఓ గుగులోత్ రాము శుక్రవారం తెలిపారు. ధ్రువపత్రాలతో ఉదయం 10 గంటల వరకు మండల కేంద్రంలో గల ఉన్నత పాఠశాలకు హాజరుకావాలన్నారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

మహబూబాబాద్ అర్బన్: గిరిజన ఆశ్రమ పాఠశాల కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల అభినందన సభ నేడు(శనివారం) హైదరాబాద్ గిరిజన భవన్‌లో జరుగుతుందని విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గుగులోత్ చిట్టిబాబు శుక్రవారం పిలుపునిచ్చారు.

రోడ్డు పనులు ప్రారంభం

నెల్లికుదురు: మండలంలోని శ్రీరామగిరి గ్రామంలో రైతులకు ఉపయోగపడే డొంకదారిలో జెడ్పీటీసీ నిధులు రూ.5లక్షలతో శుక్రవారం ఫార్మేషన్ రోడ్డు పనులకు జెడ్పీటీసీ సభ్యుడు మేకపోతుల శ్రీనివాసరెడ్డి కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటేష్, లక్ష్మీపురం సర్పంచ్ నారాయణరెడ్డి, నాయకులు బందారు శ్రీనివాసరెడ్డి, ప్రవీణ్‌రావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె



దోర్నకల్/గూడూరు/కేసముద్రం/మరిపెడ/కురవి/బయ్యారం: జిల్లా వ్యాప్తంగా జీపీ కార్మికులు, సిబ్బంది చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి రెండో రోజుగకు చేరుకుంది. ఈ సమ్మెకు పలు పార్టీ నాయకులు మద్దతు తెలిపారు.

అడ్మిషన్లకు స్పాట్ కౌన్సెలింగ్

మహబూబాబాద్ అర్బన్: గిరిజన గురుకుల కళాశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు గిరిజన గురుకుల కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మి శుక్రవారం తెలిపారు. మానుకోట, ములుగు, భూపాలపల్లి జిల్లాలోని గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఈనెల 10వ తేదీన సోమవారం బాలికలకు స్పాట్ కౌన్సెలింగ్ ఏటూరునాగారం టీటీడబ్ల్యూఆర్‌జేసీ బాలికల కళాశాలలో, 11తేదీన మంగళవారం బాలురకు టీటీడబ్ల్యూఆర్‌జేసీ బాలుర కళాశాలలో ఉదయం 10 గంటలకు అర్హులైన విద్యార్థులు ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు. ఎస్సీ, బీసీ విద్యార్థులకు స్పోర్ట్స్ కోటాలో విద్యార్థులు అడ్మిషన్లు భర్తీ చేస్తామన్నారు.

క్రైం కార్నర్..

పురుగుల మందు తాగి యువకుడి మృతి

గార్ల: మానసిక స్థితి బాగలేక ఓ యువకుడు జీవితంపై విరక్తి చెంది పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మర్రిగూడెం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. మండలంలోని మర్రిగూడెం గ్రామానికి చెందిన భూక్యా భాస్కర్(36) ఖమ్మంలోని రైల్వే క్వార్టర్‌లో నివాసం ఉంటున్న తల్లి వద్దకు వెళ్లాడు. తల్లికి ఆరోగ్యం బాగలేక పాల్వంచలోని కూతురు ఇంటికి వెళ్లింది. నాలుగు రోజుల నుంచి భాస్కర్ మానసిక స్థితి బాగలేక ఖమ్మంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య ఒక కుమారుడు ఉన్నారు.

పొలానికి గడ్డిమందు కొడుతుండగా.. తల్లి, కుమారుడికి విద్యుదాఘాతం

మహబూబాబాద్ రూరల్ : పొలానికి గడ్డి మందు కొడుతుండగా విద్యుదాఘాతం సంభవించి తల్లి, కుమారుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం మహబూబాబాద్ మండలం ఉత్తర తండా జీపీ పరిధి రాయికుంట తండాలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం తండాకు చెందిన బానోత్ బుజ్జీ, ఆమె కుమారుడు తిరుపతి తమ పొలంలో గడ్డి మందు కొడుతున్నారు. ఈ క్రమంలో అక్కడే భూమిపై తెగిపడి ఉన్న విద్యుత్ వైరును గమనించక తొక్కారు. దీంతో మొదట బుజ్జికి విద్యుత్ షాక్ తగిలింది. అది గమనించి బుజ్జిని కాపాడేందుకు వెళ్లగా కుమారుడు తిరుపతికి కూడా విద్యుత్‌షాక్ తగిలింది. వెంటనే వారిని స్థానిక రైతులు చికిత్స నిమిత్తం మానుకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. కాగా, తండాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు అంగోత్ భీముడు కుమార్తె బుజ్జి, మనవడు తిరుపతి విద్యుదాఘాతానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ చైర్మన్, పీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి తేజావత్ బెల్లయ్య నాయక్ వారిని పరామర్శించారు. ఓబీసీ జిల్లా అధ్యక్షులు వీరన్నయాదవ్, మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుట్టయ్య, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్ నాయక్, మాజీ పట్టణ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై గృహహింస చట్టం కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: అదనపు కట్నం కోసం ఓ మహిళను వేధిస్తున్న ఆమె భర్త, అత్తమామలపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని రూరల్ ఎస్సై బి.రాంచరణ్ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి గ్రామానికి చెందిన యాకుబ్ కుమార్తె అమీషాను చిన్నగూడూరు మండలం జయ్యారం గ్రామానికి చెందిన సయ్యద్ యాకూబ్, అలీమ కుమారుడు ఆలీకి ఇచ్చి ఐదేళ్ల క్రితం వివాహం జరిపించారు. ఒక పాప జన్మించాక అదనపు కట్నం కోసం ఆమెను వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలో తనకు న్యాయం చేయాలని కోరుతూ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో భర్త, అత్తమామలపై ఫిర్యాదు చేసింది. దీంతో అమీషా భర్త అలీ, అత్తమామలు యాకూబ్, అలీమాలపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని రూరల్ ఎస్సై తెలిపారు.

ఐదుగురిపై..

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని బెస్త బజారుకు చెందిన భవాని అనే మహిళకు వరంగల్ జిల్లా సంగెం మండలం మొండ్రాయి గ్రామానికి చెందిన గట్ల రాజేంద్రప్రసాద్‌తో వివాహన జరిగింది. రాజేంద్రప్రసాద్ అదనపు కట్నం కావాలంటూ వేధింపులకు గురిచేస్తూ ఆమెను కొట్టాడు. అతడి తల్లిదండ్రులు గట్ల సంపత్, గట్ల విజయ, ఆడపడుచులు రామగిరి మాధవి, మాడిశెట్టి మమత ఆమెను తీవ్ర ఇబ్బందులు పెడుతుండగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. టౌన్ ఎస్సై దీపికరెడ్డి రాజేంద్రప్రసాద్, తల్లిదండ్రులు గట్ల సంపత్, గట్ల విజయ, ఆడపడుచులు రామగిరి మాధవి, మాడిశెట్టి మమతపై కేసు నమోదు చేశారు.

ఆధునిక ప్రపంచంలో సైన్స్ పాత్ర కీలకం



కేసముద్రం: నేటి ఆధునిక ప్రపంచంలో సైన్స్‌ది కీలకపాత్ర అని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి రావుల ప్రసాద్ అన్నారు. శుక్రవారం కేసముద్రంవిలేజ్‌లోని శ్రీవివేకవర్ధిని హైస్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక మండల కమిటి అధ్యక్షుడు చిర్రయాకాంతంగౌడ్ అధ్యక్షతన విద్యార్థులు-శాస్త్రీయ అవగాహన అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం సైన్స్‌పై ప్రసంగించి ప్రతిభ కనబర్చిన బొల్లోజు ఉషశ్రీ, చెరుకు హర్షిని, ఉల్లీవర్షిని, నాజియా, అక్షయ విద్యార్థులకు నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, మండల కమిటీ అధ్యక్షుడు యాకాంతంగౌడ్, జిల్లా కమిటీ అధ్యక్షుడు తడకమల్ల బ్రహ్మం, జిల్లా ప్రధాన కార్యదర్శి దయానంద్, కోశాధికారి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.